# ప్రణబ్ ముసలం

2జీ స్కాంలో కేంద్ర హోం మంత్రి చిదంబరం పాత్రను బయటపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోట్ వివాదం మళ్ళీ తెరపైకి వచ్చింది. ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంఓ) ఒత్తిడి కారణంగానే ఆ నోట్‌ను ఆర్థిక శాఖ రూపొందించిన విషయాన్ని ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ప్రణబ్ ముఖర్జీ రాసిన లేఖ తాజాగా వెలుగులోకి తెచ్చింది. 2జీ స్పెక్ట్రమ్ స్కాంను అప్పటి ఆర్థిక మంత్రి పి.చిదంబరం అడ్డుకోలేదని రాసిన ఆర్థిక శాఖ నోట్‌ను కేబినెట్ సెక్రటేరియట్, ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంఓ)తో సంప్రదింపుల ద్వారా రూపొందించినదేనని ఆ లేఖ వెల్లడించింది. పీఎంఓ ఒత్తిడి మేరకే 2జీ నోట్‌లో హోం మంత్రి చిదంబరం పేరును జత చేసినట్లు ఆ లేఖ తెలిపింది. టెలికం స్కాంలో చిదంబరం పాత్రను ప్రస్తావించడంపై ఆర్థిక వ్యవహారాల శాఖ (ఆర్థిక మంత్రిత్వ శాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకానమిక్ అఫైర్స్–డిఈఏ)కు భిన్నాభిప్రాయం ఉందని ప్రణబ్ ఆ లేఖలో తెలిపారు. 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులను వేలంపాట ద్వారా నిర్వహించాలని ఆర్థిక మంత్రి హోదాలో చిదంబరం పట్టుబట్టి ఉంటే టెలికం స్కాం తలెత్తే అవకాశమే లేదని కేంద్ర ఆర్థిక శాఖ నోట్‌లో ఉంది. 2జీ స్కాంలో చిదంబరంపై దర్యాప్తు చేపట్టాలని కోరుతూ సుప్రీంకోర్టులో సుబ్రమణ్యం స్వామి వేసిన వ్యాజ్యం సందర్భంగా బహిర్గతమైన ఆ నోట్ అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆ సందర్భంగా ఆర్థిక శాఖ నోట్‌పై వివరణ ఇస్తూ ప్రధానికి ప్రణబ్ రెండు పేజీల లేఖ రాశారు. ఆ లేఖ తాజాగా బహిర్గతం కావడంతో కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాలకు సంబంధించిన మరో కోణం వెలుగులోకి వచ్చింది. గతంలో ప్రణబ్ ముఖర్జీ, చిదంబరంలు అధిష్ఠానం వద్ద రాజీ పడి కాంగ్రెస్‌లో సద్దుమణిగిందని భావిస్తున్న 2జీ కుంపటి మళ్ళీ రాజుకుంది.

2జీ స్పెక్ట్రమ్‌ను మొదట వచ్చిన వారికే మొదటగా కేటాయించాలన్న విధానంతో 2001నాటి ధరలకు టెలికం మంత్రిత్వ శాఖ ఆశ్రిత కంపెనీలకు కట్టబెట్టింది. దాంతో ఖజానాకు లక్షా డెబ్బై ఆరువేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని కాగ్ నివేదిక ఈ కేటాయింపుల గుట్టురట్టు చేసింది. 2008లో స్పెక్ట్రమ్ కేటాయింపుల సందర్భంలో చిదంబరం ఆర్థిక మంత్రిగా, ప్రణబ్ ముఖర్జీ విదేశాంగ మంత్రిగా, టెలికం లైసెన్సులు, స్పెక్ట్రం అంశాలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం అధ్యక్షులుగా ఉన్నారు. స్పెక్ట్రమ్ అవినీతిని ఆర్థిక మంత్రి హోదాలో చిదంబరం, ఆ అంశంపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం అధ్యక్షుని హోదాలో ప్రణబ్ ముఖర్జీలు అడ్డుకోలేదు. పైగా స్పెక్ట్రం లైసెన్సుల జారీకి వేలంపాట నిర్వహించాల్సిన అవసరం లేదంటూ, పాత విధానాన్నే కొనసాగించాలన్న అభిప్రాయాన్ని చిదంబరం, ప్రణబ్ ముఖర్జీలు వేర్వేరు సందర్భాల్లో వ్యక్తం చేశారు. 2జీ స్కాంలో చిదంబరం పాత్రపై విచారణ జరపాలని, కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలి లేదా ఆయన్ని మంత్రి పదవినుంచి బర్తరఫ్ చేయాలని ప్రతిపక్షాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. టెలికం స్కాంలో చిదంబరాన్ని సిబిఐ, యూపీఏ సర్కారు, కాంగ్రెస్ పార్టీలు పూర్తిగా సమర్థించాయి. ఆ క్రమంలో సుప్రీంకోర్టు అధికారాల పరిధిని సైతం కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించడానికి సాహసించింది.

ఆర్థిక శాఖ నోట్ కారణంగా పార్టీలో తలెత్తిన అంతర్గత విభేదాలు పరాకాష్ఠకు చేరుకోకుండా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఆ నాయకుల మధ్య రాజీ కుదిర్చారు. 2జీ స్కాంపై ప్రధానికి పంపిన ఆర్థిక శాఖ నోట్ రెండు మంత్రిత్వ శాఖల మధ్య జరిగిన సమాచార మార్పిడి మాత్రమేనని, దానిలోని అంశాలతో తనకు, శాఖకు ఏకీభావంలేదని ప్రణబ్ ప్రకటించడంతో ఇద్దరు నేతల మధ్య తలెత్తిన వివాదం సద్దుమణిగింది. చిదంబరంకు ముఖర్జీ క్లీన్ చిట్ ఇచ్చినంత మాత్రాన ఆ సమస్య ముగిసి పోలేదు. చిదంబరంపై దర్యాప్తు జరపడం కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయం ఎంతమాత్రమూ కాదు. అయితే తాజాగా బహిర్గతమైన ప్రణబ్ లేఖలో ఆర్థిక శాఖ నోట్‌కు సంబంధించిన పూర్వాపరాలను ఆయన ఒక క్రమంలో వివరించారు. కేంద్ర హోం మంత్రి చిదంబరంపై కూడా 2జీ స్కాం ఆరోపణలు మీడియాలో ప్రచారమవుతున్న నేపథ్యంలో స్పెక్ట్రమ్ కేటాయింపులు, ధరల నిర్ణయం తదితర విషయాలపై ఒక సమగ్రమైన అవగాహనకోసం కృషి చేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయంతో ఆర్థికశాఖ నోట్ కథ మొదలైనట్లు లేఖ తెలిపింది. కేంద్ర కేబినెట్ సెక్రటరీ ఉత్తర్వుల మేరకు 2011 జనవరిలో వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల మధ్య జరిగిన సంప్రదింపుల వ్యవహారాలిన్నిటినీ గుదిగుచ్చే ప్రయత్నాలు ప్రారంభమైనాయి. పీఎంఓ, డీఈఏ, డీఓటీ కార్యాలయ సీనియర్ అధికారులు, కేబినెట్ సెక్రటరీల మధ్య అనేక సమావేశాలు జరిగాయి. పరస్పరం అనేక వివరణలు, ఈ మెయిల్ లావాదేవీలు జరిగాయి. పర్యవసానంగా 2011 మార్చిలో 12 పేరాలతో కూడిన 'క్రానాలజీ ఆఫ్ బేసిక్ ఫాక్ట్స్ రిలేటెడ్ టు ప్రైజింగ్ అండ్ అలకేషన్ ఆఫ్ స్పెక్ట్రమ్' అనే ఒక నోట్‌ను ఆర్థిక శాఖ తయారు చేసింది. అయితే ఆ నోట్ సమగ్రంగా లేదని, డిఈఏ గత వైఖరిని వివరించడమే కాకుండా మాత్రమే కాకుండా వర్తమానంలో ఎలా వ్యవహరించాలని కూడా విశదపరచాలని కేబినెట్ సెక్రటేరియట్ సూచించినట్లు ప్రణబ్ లేఖ తెలిపింది. కేబినెట్ సెక్రటేరియట్ సూచనలకు అనుగుణంగా ఆర్థిక శాఖ సవరించిన నోట్ తయారు చేసింది. 2008 జనవరిలో జరిగిన స్పెక్ట్రమ్ కేటాయింపుల సందర్భంగా చేసుకున్న అవగాహనా పత్రాలలోని క్లాజు 5.1, 43.5(4)ల ప్రకారం ఎలాంటి కారణం చూపకుండా స్పెక్ట్రమ్ లైసెన్సులను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ఆ అధికారాన్ని వినియోగించి టెలికం మంత్రి ఎ. రాజా కేటాయిస్తున్న స్పెక్ట్రమ్ కేటాయింపులను చిదంబరం నిలువరించి ఉండాల్సిందని ఆర్థికశాఖ నోట్ వ్యాఖ్యానించింది. ప్రణబ్ నోట్‌లోని ఈ వ్యాఖ్యానం చిదంబరం, యూపీఏ ప్రభుత్వం మెడకు ఉచ్చులాగా చుట్టుకుంది. ఆర్థిక శాఖ నోట్‌లోని అభిప్రాయాలను తోసిపుచ్చడం ద్వారా ప్రణబ్ లేఖ చిదంబరానికి క్లీన్ చిట్ ఇచ్చింది. రెండు ప్రభుత్వ శాఖల అంతర్గత వ్యవహారాల్లో చోటు చేసుకున్న అపార్థాల పర్యవసానంగా ఇంత రాద్ధాంతం జరిగినట్లుగా చిత్రీకరించేందుకు యూపీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 2 జీ స్కాం విషయంలో చిదంబరంపై వచ్చిన ఆరోపణలను ప్రణబ్ లేఖ ద్వారా పక్కదారి పట్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.

యూపీఏ–2 ప్రభుత్వ హయాంలో తలెత్తిన వరుస స్కాంలకు వ్యతిరేకంగా పార్లమెంట్ లోపల, బయట ప్రతిపక్షాలు పోరాటులు చేశాయి. ప్రజలు, ప్రజాస్వామిక సంస్థలు, పౌరసమాజం అనేక ఉద్యమాలు నిర్వహించాయి. దాంతో ఆ స్కాంలపై సుప్రీంకోర్టు ప్రత్యక్ష పర్యవేక్షణలో సిబిఐ దర్యాప్తు ప్రారంభమైంది. పర్యవసానంగా రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, కార్పొరేట్ సంస్థల అధికారులను ప్రభుత్వం జైల్లో పెట్టి న్యాయ విచారణ జరిపిస్తోంది. కామన్‌వెల్త్ గేమ్స్ స్కాంలో కల్మాడీ, ఆదర్శ్ కుంభకోణంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ చవాన్‌లపై చర్య తీసుకొన్న కాంగ్రెస్ ప్రభుత్వం చిదంబరం వ్యవహారంలో తటపటాయిస్తోంది. యూపీఏ భాగస్వామి పార్టీ డిఎంకె నేతలు రాజా, కనిమొళి, మారన్‌లపై జరుగుతున్న విచారణ విషయంలో ఎలాంటి జోక్యం చేసుకోకుండా నిష్పాక్షికంగా ఉన్నట్లు వ్యవహరించిన కాంగ్రెస్ తన పార్టీ ప్రముఖుల పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తోంది. కల్మాడీ, చవాన్‌లను దూరం చేసుకున్నంత సులువుగా చిదంబరంను కాంగ్రెస్ దూరం చేసుకోలేదు. వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్‌తో సహా దాదాపు ఐదు రాష్ట్రాల్లో జరుగనున్న శాసనసభ ఎన్నికలు, 2014 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అగ్రనాయకులపై ఇలాంటి ఆరోపణలు రావడం కాంగ్రెస్ పార్టీకి ఆందోళన కలిగిస్తోంది. 2జీ కుంభకోణంతో సహా యూపీఏ హయాంలో జరిగిన అన్ని కుంభకోణాలపై సమగ్రమైన దర్యాప్తు చేపట్టేందుకు జన్ లోక్‌పాల్ వంటి తీర్పరి వ్యవస్థ అవసరం. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లోనే జన్ లోక్‌పాల్ బిల్లును ఆమోదించాలని అన్నా బృందం మరోసారి నిరశన దీక్షకు సమాయత్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రణబ్ లేఖ ఆ సమావేశాలను మరింత వేడెక్కించే అవకాశముంది.

# నిజాలు చెప్తే నిష్ఠూరాలా?

'స్నేహపూరితంగా విడిపోవాల'ని రాసినందుకు (అక్టోబర్ 26, ఆంధ్రజ్యోతి) హరగోపాల్‌పై అడుసుమిల్లి జయప్రకాశ్ తీవ్రంగానే విరుచుకుపడ్డారు (అక్టోబర్ 29, ఆంధ్రజ్యోతి). గందరగోళంతో ఏవేవో రాశారు. అసలు ఎప్పుడైనా రాజనీతి శాస్త్ర ఆచార్యునిగా పనిచేశారా? అని అనుమానపడ్డారు. హరగోపాల్‌ను స్వయంగా ఆయుధాలు పట్టుకునే అజ్ఞాత వ్యక్తిగా చిత్రించి, మావోయిస్టుగా చూపించే ప్రయత్నం చేస్తూ మావోయిస్టు సిద్ధాంతాలను తూర్పారబడుతూ, హరగోపాల్ వ్యాసానికి మావోయిస్టు వ్యతిరేక విమర్శే జవాబుగా భావించి రాశారు జయప్రకాశ్. హరగోపాల్ భావాలను, ఆలోచనలను, ఆయన ప్రజలకు సూచించిన మార్గాన్ని సరిగ్గా అర్థం చేసుకోకుండా, అసలు విషయాన్ని, చర్చను తానే గందరగోళపరిచి, పక్కదారి పట్టించి పైగా హరగోపాల్‌దే 'ఆచార్యుని గందరగోళం' అంటూ నిర్ధారించి పారేశారు.

హరగోపాల్ తన వ్యాసంలో విభజనకు ప్రాతిపదిక ఏమిటనే విషయాన్ని ఎక్కడా చెప్పలేదని జయప్రకాశ్ అంటున్నారు. కానీ చివరి పేరాలో పరోక్షంగా హరగోపాల్ ఆ ప్రాతిపదికలు ఏమిటో చెప్పారు. పెట్టుబడులు, స్వార్థ ప్రయోజనాలు, వ్యవస్థీకృత దోపిడీలు లేకపోవడం, రాజకీయాలు, ఆర్థిక సంయోజనాలు వేరుపడటం, సామాజిక సంబంధాలు ఉన్న తీకరింపబడటం, విభజనకు ప్రాతిపదికలని ఆయన చాలా స్పష్టంగానే రాశారు. స్వయం పాలన కోసం ఉద్యమించాలని హరగోపాల్ సూచించడాన్ని ప్రజాస్వామ్యం పట్ల నమ్మకం లేకపోవడంగా జయప్రకాశ్ తప్పుపట్టారు. 'ప్రజాస్వామ్యం అంటే స్వయం పాలన అని, స్వయంపాలన అంటే ప్రజాస్వామ్యమ'ని రాజనీతి ఆచార్యునికి రాజనీతి పాఠాలు చెప్తున్నారు. అసలు మనదేశంలో ఎన్ని ప్రాంతాల ప్రజలు తమను తాము పాలించుకుంటున్నారు. కాశ్మీర్‌ను కాశ్మీర్ ప్రజలు, గూర్ఖాలాండ్‌ను గూర్ఖాలు, బోలాండ్‌ను బోడోలు... ఇలా చెప్పుకుంటూ పోతే గిరిజనులు, మైనారిటీలు, ఆదివాసులు ఎవరైనా తమను తాము పాలించుకుంటున్నారా? ఒక అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో స్వయంపాలన ఎన్ని ప్రాంతాలలో జరుగుతున్నది? పంచాయతీ, మునిసిపాలిటీ, జడ్‌పి లాంటి స్థానిక సంస్థలే స్వయంపాలనకు చిహ్నాలని నమ్మే అమాయక స్థితిలో ప్రజలు లేరని జయప్రకాశ్ గమనించాలి. వికేంద్రీకరణకు తూట్లు పొడిచి అధికారాలను, నిర్ణయాలను ఏ దశలలోనైతే కేంద్రీకృతం చేసుకున్నారో ఆ దశలలో పాలకులెవరైననూ నిర్ణయాలు ఎవరికి అనుకూలంగా ఉంటున్నాయి అనే దానిపైననే స్వయంపాలన ఉందా, లేదా? అనేది ఆధారపడి ఉంటుంది. ఇక హరగోపాల్ తెలంగాణ ఉద్యమాన్ని రాష్ట్రం నుంచి రాష్ట్రంగా విడిపోవడంగా చూస్తే జయప్రకాశ్ దాన్ని దేశం నుంచి దేశంగా విడిపోవడంగా హరగోపాల్ రాసినట్లు వక్రీకరించారు. అరవై ఏళ్లుగా భాషలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, జీవన విధానాలు కలవకపోయిననూ, సమైక్య రాష్ట్రంలో తమకివ్వబడిన రక్షణలు, హామీలు ఉల్లంఘనలకు గురైనపుడు ఆ మోసాలు, వివక్షల నుంచి ఏర్పడిన ఆత్మగౌరవ, స్వయంపాలన భావనలు ప్రత్యేక జీవనాన్ని కోరుకుంటే తప్పేమిటి? ఎందుకు అభ్యంతరముండాలి? సమైక్యత అనేది ఒక ఉదాత్తమైన భావన. సమైక్యంగా ఉండమని అడిగే ముందు అందుకు సంబంధించిన నమ్మకాన్ని కలిగించాలి కదా! అలా జరగనపుడు విడిపోవాలని ఆకాంక్షించడంలో తప్పేముంది? అసలు దేశం ఎప్పుడు ముక్క చెక్కలవుతుంది? దేశం నుంచి ప్రాంతాలు విడిపోయి వేరే దేశాలుగా మారినపుడు అలాంటిదేమీ తెలంగాణ ప్రజలు కోరుకోవడం లేదే! భారతదేశంలో భాగంగానే ఒక రాష్ట్రంగా ఉండాలనుకుంటున్నారు. అది కూడా దేశద్రోహమే, తప్పే అంటే భారత రాజ్యాంగంలో 3వ ఆర్టికల్ లోని కొత్త రాష్ట్రాల ఏర్పాటును అంగీకరించనట్లే అవుతుంది. కనుక రాజ్యాంగం ప్రకారం చూసినా కూడా రాష్ట్రంగా విడిపోవడం నూటికి నూరుపాళ్లు సరైనదే.

ఒక ప్రాంతం మరొక ప్రాంతం ఆధిపత్యంలో ఉన్నదని హరగోపాల్ అనలేదు. కానీ తెలంగాణ మరొక ప్రాంత నాయకుల, పాలకుల, పెట్టుబడిదార్ల ఆధిపత్యంలో ఉంది. తెలంగాణ అంటే కేవలం ముఖ్యమంత్రి, మంత్రి పదవులే కాదని, కోట్లాది ప్రజల ప్రయోజనాలు, రాజ్యాంగ సంస్థలు, కోర్టులు అని సుద్దులు చెప్తున్న జయప్రకాశ్ నిజంగా తెలంగాణలో కోట్లాది మంది ప్రయోజనాలు నెరవేరుతున్నాయా? రాజ్యాంగ సంస్థలు నిష్పక్షపాతంగా తెలంగాణకు న్యాయం చేస్తున్నాయా? అని ఏనాడైనా ఆలోచించారా? ఆలోచిస్తే ఇలా అనేవారు కాదు. చెప్పడానికి బాగానే ఉండే ఆదర్శాలు చాలా మట్టుకు ఆచరణలో కనిపించవు. మనదేశం ప్రజాస్వామ్య, సామ్యవాద, లౌకిక దేశమని చెప్తూ ఉంటాం. స్వయంపాలన అంటే ప్రజాస్వామ్యమని, తెలంగాణ అంటే పదవులు కాదని జయప్రకాశ్ చెప్తున్న ఈ ఆదర్శాలన్నీ తెలంగాణ ప్రజలకు అందనంత దూరంలో ఉన్నాయి కనుకనే తెలంగాణ రాష్ట్రం కోసం కోట్లాది ప్రజలు పోరాడుతున్నారు. కానీ ఆ ప్రజల ఆకాంక్షలను గుర్తించడానికి జయప్రకాశ్ నిరాకరిస్తూ, పైగా ఆ ప్రజల పక్షాన రాసిన హరగోపాల్‌ను నిందిస్తున్నారు. హరగోపాల్ వ్యాసంలోని అన్ని అంశాలను వక్రీకరించినట్లే మహబూబ్‌నగర్ జిల్లా విషయాన్ని కూడా వక్రీకరించారు. కృష్ణానది 300 కి.మీ ప్రవహిస్తున్ననూ ఏమాత్రం నీటివసతి జిల్లాకు లేదని హరగోపాల్ అంటే దానికి సూటిగా సమాధానం చెప్పకుండా ఏవేవో లెక్కలు చూపించి మొత్తం విషయాన్నే గందరగోళ పరిచారు. మొదటి పంట, రెండవ పంట, ఆహారధాన్యాల లెక్కలు, సముద్ర మట్టం ఎత్తు వంటి అనవసర గణాంకాలతో అసలు విషయాన్ని దాటవేశారు. కృష్ణా నీరు ఎందుకు రావడం లేదు? అనే ప్రశ్నకు జవాబివ్వదలచుకుంటే ఎన్ని ఎకరాలకు కృష్ణా నీరు వస్తుందో చెప్తే సరిపోతుంది. కానీ ఏవేవో విషయాలు ముందుపెట్టి, ఆ విషయాన్ని మాత్రం చెప్పకుండా కప్పదాటు ధోరణి ప్రదర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా మొత్తం నీటిపారుదల చూస్తే కెనాళ్ల ద్వారా 16.4 శాతం, బోర్ల ద్వారా 76 శాతం, టాంకులు, బావుల ద్వారా 3.7 శాతం, ఇతర మార్గాల ద్వారా 3.9 శాతం సాగు జరుగుతున్నది. మిగతా భూముల సాగుకు, కృష్ణా నీటికి సంబంధమే లేదు. అదే హరగోపాల్ అడిగారు. దానికి జవాబుగా సాగయ్యే భూముల మొత్తం సంఖ్యను చూపిస్తే ఏం ప్రయోజనం? మొత్తంగా చూస్తే జయప్రకాశ్ వ్యాసం చదివాక విషయాలను అర్థం చేసుకోకుండా, ఎంత సులువుగా వక్రీకరించవచ్చో తెలుసుకుని ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. ఇలాంటి అసత్య విశ్లేషణలతో నిజాలను రూపుమాసే ప్రయత్నం చేయాలనుకోవటం ఎన్నిటికీ సాధ్యపడదని, నిజం నిప్పులాంటిది అని అడుసుమిల్లి జయప్రకాశ్ లాంటి సమైక్య వాదులు గ్రహించాల్సి ఉంది.

– లోకే అరణ్య, మంథని, కరీంనగర్ జిల్లా

# విరమణ కాదు – విద్రోహమే

నా తెలంగాణ కోటి గాయాల గేయమేనా..?
రాజకీయ చదరంగంలో, ఇగ రాజీపడ్డ బతుకులేనా?

సకల జనుల సమ్మె దాదాపు 42 రోజుల వరకు కొనసాగింది. మధ్యమధ్యన ఆర్.టి.సి. ఎంప్లాయీస్ విరమణ 32వ రోజు చేసినా.. డిపార్ట్‌మెంట్‌ల వారీగా... క్రమక్రమంగా సీమాంధ్ర ప్రభుత్వంతో చర్చల అనంతరం సమ్మె పూర్తిస్థాయిలో విరమిస్తున్నట్లు ప్రకటించే వరకు... విరమణల వెనుక ఒక విద్రోహపూరితమైన కుట్ర దాగున్నట్లు సగటు తెలంగాణ వాదికి కనిపించే నగ్నసత్యం. అసలు సకల జనుల ప్రారంభం నుండే ఏదో సంశయం కనిపించింది. మొదట 6వ తేదీ నుండి 13వ తేదీకి వాయిదా వేయడం. వాయిదా వెనుక రాజకీయ నాయకుల ప్రయోజనాలు ఉన్నట్లు కనిపించింది. సమ్మె ఉద్యమ రూపాలు ఏ ఒక్కటీ ఉద్యమాన్ని ఉధృతం చేసేవిగా లేకపోవడం బాధాకరం. కాని సమ్మె ప్రారంభ కాలంలో మొట్టమొదటిసారిగా కోదండరాం విరమించినా, మేం నడిపిస్తాం అని గద్దర్ ప్రకటించడం వలన సమ్మెల్లో పాల్గొనాలనుకునే వారికి ఎంతో గుండె ధైర్యాన్ని నింపింది. అయితే మొట్టమొదటిసారి సకలజనుల సమ్మెలో ముందు వరుసలో నిలబడ్డది సింగరేణి కార్మికులే. అటు తర్వాత అన్ని డిపార్ట్‌మెంట్లు, ఆర్.టి.సి, విద్యుత్, పాఠశాలలు/టీచర్లు, డాక్టర్లు, లైబ్రరీ ఉద్యోగులు, టూరిజం, న్యాయవాదులు, టి.ఎన్.జి.ఓ.లు, గెజిటెడ్ ఉద్యోగులు అన్ని ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు, అన్ని కార్మిక సంఘాలు ఆఖరికి హమాలీ సంఘంతో సహా సమ్మెలో భాగస్వాములై పనిచేశారు. అయితే క్రమక్రమంగా అన్ని రంగాల ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నప్పటికీ ప్రభుత్వం నుండి తగిన స్పందన ఎందుకు రాలేదు? ప్రభుత్వ ఆర్థిక మూలాల్ని దెబ్బతీసేటట్లు ఉద్యమం జరిగినా ప్రభుత్వానికి ఎందుకు భయం కలగలేదు? రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తెలంగాణ ప్రాంత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పూర్తిస్థాయిలో కార్యాలయాలకు తాళాలేసినా, కేంద్రం నుండి కదలిక రాలేదెందుకు? ఏ ప్రకటన రాకముందే రాజకీయ జెఏసి విరమించింది ఎందుకు? ఉద్యోగులు విరమించేటప్పుడు చర్చలు సఫలమైనట్లు 9 డిమాండ్‌లకు ప్రభుత్వం అంగీకరించినట్లు, సంతకాలు చేసినట్లు నేతలు ప్రకటించారు. అసలు సమ్మె ఈ తొమ్మిది డిమాండ్ల కోసం కాదు కదా? సమ్మె ప్రధాన లక్ష్యం రాష్ట్రం కోసం కదా? విద్యార్థులు/యువకులు బలిదానాలు చూసి చలించిపోయాం, జీవితాలే కోల్పోతున్న నేల మీద మా జీతాలొక లెక్క కాదని ఉద్యోగులు ఎన్నోసార్లు ప్రకటించారు. ఎంతో దృఢ నిశ్చయంతో ఉన్నారు. పవిత్రమైన కార్యంగా భావించారు, ఇంతలోనే ఏం జరిగినట్లు?

విరమణల రోడ్ మ్యాప్ ఎవరిది? కాంగ్రెస్‌దా? టిఆర్ఎస్‌దా? జె.ఎ.సి.దా? ఎవరి ప్రభావం ఉద్యోగులపై పడింది? ఏ ప్రలోభాలు, ఎవరి రాజకీయ స్వార్థాలు, ఈ సమ్మెను విరమింప చేశాయి? అంటే అది కచ్చితంగా కెసిఆర్–కోదండరాంల కుట్రనే (కే.కో.కుట్ర) అని స్పష్టమవుతుంది.

ఉద్యోగుల నిజాయితీ మీద కె.సి.ఆర్ కోదండరాంల రహస్య ఒప్పంద స్వార్థపు బురద చల్లారు. మనకోసం – మన భవిష్యత్ తరాల కోసం చేస్తున్నామని ఉద్యోగులు, నాల్గవ తరగతి ఉద్యోగులు సైతం నానా కష్టాలు పడ్డారు. సామాన్య ప్రజానీకం ఆర్‌టిసి బస్సులు బంద్ ఉన్నందుకు ఎన్నో ప్రయాణాలు మానేసుకున్నారు. చిన్నా చితకా వ్యాపారులు పోతే పోయే తెలంగాణ కోసమే కదా అని త్యాగం చేశారు. ఇలా ప్రత్యక్షంగా ఉద్యోగులు ఉద్యమాల్లో ఉంటే ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్ని వర్గాల ప్రజలు ఆయా మండల కేంద్రాల్లో, డివిజన్‌లలో, గ్రామాల్లో నిరహార దీక్షలు చేసి సంఘీభావం తెలిపారు. వారం రోజుల క్రితం ఆర్మూర్‌లో తెలంగాణ సాధన కోసం '1500 డప్పుల దరువు' ర్యాలీ సభ పెట్టినప్పుడు నేను హాజరైన సందర్భంగా ఒక పెద్దాయన... ''బిడ్డా... ఇన్ని రోజులు బస్సులు తిరుగకుండ ఉండుడు నా జీవితంలో మొదటి సారి అని చెప్తూ, తెలంగాణ వస్తదంటవా బిడ్డా..'' అని అనుమానంగా అడిగాడు. ఈ అనుమానం ఒక పెద్దమనిషిదే కాదు నాలుగు కోట్ల ప్రజల అనుమానమే అని నాకనిపించింది. ఎందుకంటే ఉద్యమం ఇంతగా నడుస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమ కుట్టినట్టు కూడా లేదంటే అందులో ఖచ్చితంగా ఈ ప్రాంతపు రాజకీయ నాయకుల లాలూచీతనం ఉందనే అనుమానం కలుగక మానదు. కాంగ్రెస్ ద్రోహపూరితమైన పార్టీ అయినప్పుడు అదే కాంగ్రెస్ నాయకులు చేసే డ్రామాలు చూస్తూ టి.ఆర్.ఎస్ ఎందుకు మౌనం వహించినట్లు? ఉద్యమంలో రాజీనామాలు ఆమోదం పొందకుండా నామమాత్రంగా ఎందుకు మిగిలాయి? సమ్మెకాలంలో ఉద్యోగులు జీతాలు త్యాగం చేస్తుంటే, రాజకీయ నేతలు జీతాలు ఎందుకు తీసుకున్నట్లు? రాజీనామాలు ఆమోదించేది వీరి చేతిలో లేకున్నా, జీతాలు తీసుకునేది వీళ్ళ చేతుల్లోనే వుంది కదా? అంటే ఇది పార్టీల ద్వంద్వ వైఖరి కాదా? ఇలా ఏ అంశాన్ని చూసినా... అన్ని రాజకీయ పార్టీలు ఉద్యమాన్ని తమ స్వార్థం కోసం వాడుకుంటున్నాయన్నదే చారిత్రక వాస్తవం. ఈ సందర్భంలో పార్టీల/నేతల మాటలు, ప్రధానంగా కెసిఆర్–కోదండరాంలు, నిజాయితీతో ఉద్యమంలోకి వచ్చిన ఉద్యోగుల్ని నిర్వీర్యం చేశారు. ఇన్ని డిపార్ట్‌మెంట్లు లక్షలాది ఉద్యోగులకు ఒక ఉమ్మడి కార్యక్రమం లేకపోవడం వెనుక కోదండరాం ఉద్యమ ఉధృతి వైపు కాకుండా ఉద్యమ నిర్వీర్యం వైపు అడుగులేసినట్లు అర్థమౌతుంది. తెలంగాణ ఏకైక ప్రధాన లక్ష్యమని చెప్పిన ఉద్యోగులకు, విరమణ కోసమే రూపొందించుకున్న 9 డిమాండ్లకు ప్రభుత్వం ఒప్పుకున్నట్లు పొలిటికల్ జెఏసి సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించడం హాస్యాస్పద అనుమానమే. గతంలో సింగరేణి కార్మికులు ఏ సమ్మె చేసినా అది విఫలమైనట్లు కార్మికుల చరిత్రలోనే లేదు. వేతన ఒప్పందం కోసం గతంలో సికాస పిలుపు మేరకు దాదాపు 55 రోజులు సమ్మె చేసి వేజ్ బోర్డు సాధించుకున్న చరిత్ర సింగరేణి కార్మికులది. అలాంటి కార్మికులను సైతం ఏ ఫలితం లేకుండా విరమింపచేసిన ద్రోహూలెవరు? టీచర్లు, లెక్చరర్లు, ఏ ఒక్కరు మనస్ఫూర్తిగా విరమించలేదన్నది వాస్తవం. గతంలో విద్యార్థి ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి పూనుకున్న స్వార్థ రాజకీయ పార్టీలే, ఇప్పుడు ఉద్యోగుల ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసినట్లు కనిపిస్తోంది. ఉద్యోగ సంఘాల్లోని కొంతమంది నేతలు రాజకీయ పార్టీలకు వత్తాసు పలకడం వల్లనే రాజకీయ పార్టీల సూచనల మేరకు ఉద్యమ విరమణ ప్రకటన చేసినట్లు కన్పిస్తోంది. ఇది 60 సంవత్సరాల ఉద్యమంలో ఒక కొత్త కోణం. ఇంతటి మహత్తర ఉద్యమం మరోసారి సాధ్యమా అని అనుకుంటున్న వాళ్ళందరికీ ఇదొక నిరాశనే మిగిల్చింది.

60 ఏళ్ల చరిత్రలో రాజకీయ పార్టీలది మోసపూరితమైన పాత్రనే. చెన్నారెడ్డిని మించిన ద్రోహం ప్రస్తుతం మన కండ్లముందు ప్రత్యక్షంగా కనబడుతుంది. తెలంగాణ రోడ్ మ్యాప్ ప్రకటించమని కొట్లాడిన ఉద్యమకారులను వక్రదారి పట్టిస్తూ ఉద్యమాన్ని ఎట్లా నిర్వీర్యం చేయాలో, ఏఏ దశల్లో ఎవర్ని విరమింప చేయాలనే 'విరమణల రోడ్ మ్యాప్' తీసుకొని కేంద్రంతో కుమ్మక్కై, తమ వ్యాపార లావాదేవీల కోసం, తమ కుటుంబ రాజకీయాల కోసం, ఉద్యమాన్ని వాడుకునే ఏ రాజకీయ పార్టీ నేతలకైనా ప్రజల మధ్యన గుణపాఠం తప్పదు. విరమణ వెనుక దాగిన విద్రోహాన్ని సరిగ్గా అర్థం చేసుకుందాం. సకలజనుల సమ్మెలో సర్వం కోల్పోవడానికి సిద్ధపడ్డది ఉద్యోగులు, కాని సర్వనాశనం చేసింది రాజకీయ పార్టీ నేతలే. 'ఇది విరమణ కాదు పార్టీల విద్రోహమే.' మళ్ళీ తెలంగాణ ప్రజలకు భరోసానివ్వాల్సింది, కేంద్ర ప్రభుత్వాన్ని గడగడలాడించిన విద్యార్థి యువతరమే. ఉద్యమం ఆగిపోయిందని, ఇక తెలంగాణ రాదని ఆవేశంతో, మనస్సు కలత చెంది ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దు. నిస్వార్థంగా పనిచేసే యువకులు రాజకీయ పార్టీలకు అతీతంగా విద్యాలయాల్ని ఉద్యమ కేంద్రాలుగా చేసి పోరాడే సమయం ఆసన్నమైంది.

– దరువు ఎల్లన్న
ఉస్మానియా పరిశోధక విద్యార్థి

## ఇండియా గేట్

**ఎ.కృష్ణారావు**

# గవర్నర్లూ, కేంద్రమూ

**గవర్నర్లలో ఎంతమంది తమ బాధ్యతలను సరైన విధంగా నిర్వర్తిస్తున్నారు? రాజ్యాంగంలోని 5వ షెడ్యూలు ప్రకారం గిరిజనుల యోగక్షేమాలను ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత గవర్నర్లది. అటార్నీ జనరల్ వాహనావతి, ప్రణాళికా సంఘం నియమించిన మంగేష్కర్ కమిటీ అభిప్రాయాల ప్రకారం గిరిజనుల ప్రయోజనాలను కేంద్రం గవర్నర్ల ద్వారా నేరుగా కాపాడవచ్చు. గవర్నర్లు నిజానికి ప్రతి ఏటా ఈమేరకు వార్షిక నివేదికలు పంపాలి. కాని ఎంతమంది గవర్నర్లు ఈ మేరకు నివేదికలు పంపుతున్నారు? కేంద్రం వాటిని ఎంతమేరకు పట్టించుకుంటున్నది?**

అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గవర్నర్ల సమావేశం జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచీ ఇది 43వ గవర్నర్ల సమావేశం. నిజానికి ప్రతి రెండేళ్లకోసారి ఈ సమావేశం జరగాలి. కాని ఎన్నోసార్లు ఈ సమావేశాలు కనీసం రెండేళ్లకోసారి కూడా జరగలేదు. ఉదాహరణకు 2008లో 42వ గవర్నర్ల సమావేశం జరిగింది. మూడేళ్ల తర్వాత ఈ సమావేశం జరిగింది. గవర్నర్లు నిజానికి కేంద్రానికి కళ్లూ చెవులుగా వ్యవహరించాలంటారు. కాని కేంద్రానికే ఈ కళ్లూ, చెవుల పట్ల పెద్దగా ఆసక్తి లేదని సమావేశాలను నిర్వహించిన తీరును బట్టి అర్థమవుతోంది. గవర్నర్లకు కేంద్రం ప్రాధాన్యం ఇచ్చి ఉంటే వారిని కనీసం ఏడాదికైనా పిలిచి సమావేశపరుస్తుండాలి. గవర్నర్లు ఇచ్చే నివేదికలను పట్టించుకోవాలి. అలాంటిదేదీ జరుగుతున్నట్లు లేదు. గవర్నర్లు తరచూ తమంతట తాము ఢిల్లీ వస్తుంటారు. ముఖ్యమంత్రుల లాగానే రెండురోజులు, మూడురోజులు బస చేసి కేంద్రంలో ప్రముఖుల వద్ద అపాయింట్‌మెంట్లు తీసుకుని వారిని కలుసుకునే ప్రయత్నం చేస్తుంటారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీని కూడా కలుసుకుని తమ విధేయతను ప్రకటించి వెళ్లిపోతుంటారు. ఢిల్లీ వచ్చినప్పుడల్లా అందర్నీ కలుసుకుని నమస్కారం పెట్టకపోతే మమ్మల్ని ఎవరు పట్టించుకుంటారు.. అని ఇటీవల ఒక గవర్నర్ విలేకరుల వద్దే వ్యాఖ్యానించారు.

రాజ్యాంగం ప్రకారం గవర్నర్ పదవికి చాలా ప్రాధాన్యమున్నది. రాష్ట్రాలలో ఉన్న పరిస్థితుల గురించి కేంద్రానికి సరైన నివేదికలు గవర్నర్ల ద్వారానే అందే అవకాశాలున్నాయి. రాష్ట్రాల్లో ప్రజల అవసరాలు, మనోభావాలను గవర్నర్లు పట్టించుకుని సరైన నివేదికలు పంపించకపోతే కేంద్రానికి ముఖ్యమంత్రులనుంచి ఏకపక్షమైన నివేదికలు మాత్రమే వస్తుంటాయి. కాని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన సమావేశం తీరు చూస్తుంటే చాలా మంది గవర్నర్లు కేంద్రం పట్ల చాలా అసంతృప్తితో ఉన్నట్లు అర్థమవుతోంది. తాము కేంద్రంలోని వివిధ మంత్రులకు పంపించే నివేదికలను కనీసం వారు చదువుతున్నట్లు కూడా లేరు.. అని దాదాపు అన్ని రాష్ట్రాల గవర్నర్లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. అసలు కేంద్ర మంత్రుల నుంచి తమకు కనీసం లేఖ అందినట్లు ప్రత్యుత్తరం కూడా రాదు.. అని ఒక గవర్నర్ ఆవేదన వ్యక్తం చేశారు. తామే కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులుగా పనిచేస్తున్నామని భావిస్తుంటే కేంద్రానికి అసలు గవర్నర్లంటేనే పట్టింపులేకుండా పోయిందని వారు బాధపడ్డారు. నిజానికి కొంతమంది గవర్నర్లు కేంద్రం పిలువకపోయినా సరే ఢిల్లీ వచ్చి పదే పదే నివేదికలు సమర్పిస్తుంటారు. ఢిల్లీలోనే ఎప్పుడూ మకాం వేసే గవర్నర్లు ఉన్నారు. వారికోసం ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వాల భవన్‌లలో ప్రత్యేక నివాసాలుంటాయి. ప్రత్యేక సిబ్బంది, భద్రతాధికారులు ఉంటారు. ఢిల్లీ పోలీసులు కూడా వారిని కనిపెట్టుకుంటూ ఉంటారు. గవర్నర్లకు సౌకర్యాలు, దర్పం పేరిట వేల కోట్లు ఖర్చవుతుంటాయి. అయినప్పటికీ గవర్నర్ల వ్యవస్థను కేంద్రం సరిగా ఉపయోగించుకుంటున్నట్లు దాఖలాలు కనపడడం లేదు. కేవలం ఈ సౌకర్యాల కోసమా మేము ఢిల్లీ వచ్చేది? మా నివేదికలను పట్టించుకుని సరైన చర్యలు తీసుకోకపోతే, మమ్మల్ని ఉపయోగించుకోకపోతే మేము ఉండి మాత్రం లాభమేమిటి? మా పదవులు కేవలం అలంకారప్రాయమేనా? అని వాపోయే గవర్నర్లు కూడా ఉన్నారు. సెంట్రల్ యూనివర్సిటీల్లో తమను రెక్టార్లుగా భావిస్తారు.. కాని మేమేం చేయాలి? మా అధికారాలేమిటి? అని గవర్నర్లు కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నారు.

కాంగ్రెస్ పద్ధతులను చూస్తుంటే గవర్నర్ల నియామకం చాలా వరకు పునరావాసం కల్పించడం కోసమేనన్న విషయం అర్థమవుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించిన సీనియర్ అధికారులను, ముఖ్యంగా పోలీసు అధికారులను, రాష్ట్రాల్లో విధేయంగా ఉన్న సీనియర్ నాయకులను, తాము అడిగిన వెంటనే పదవులను తృణప్రాయంగా వదిలిపెట్టిన రాజకీయ కురువృద్ధులను ఈ పదవులు వరిస్తుంటాయి. ఇందిరాగాంధీ హయాంలోనైతే ఎక్కువగా రాజకీయ నేతలను ఈ పదవులు వరించేవి. రాజకీయ ఎత్తుగడల్లో భాగంగా ఆమె పలువురిని గవర్నర్లుగా నియమించారు. తనను ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా నియమించిన విషయాన్ని ఎపి ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ వస్తుండగా పేపర్‌లో చదువుకున్నట్లు బెజవాడ గోపాల్ రెడ్డి తన ఆత్మకథలో రాశారు. మర్రి చెన్నారెడ్డికి కూడా ఉత్తర ప్రదేశ్ గవర్నర్ పదవి ఎందుకు లభించిందో అందరికీ తెలిసిందే. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ కేబినెట్‌లలో కీలక మంత్రిపదవులు నిర్వహించిన పి.శివశంకర్‌ను పివి తొలుత సిక్కిం, తర్వాత కేరళ గవర్నర్‌గా నియమించడం వెనుక కూడా మతలబు లేకపోలేదు. మరి అజాతశత్రువుగా పేరు పొంది, ఏ కాంగ్రెస్ ముఖ్యమంత్రి హయాంలోనైనా మంత్రిగా పనిచేసిన అనుభవం, అడిగినవెంటనే ముఖ్యమంత్రి పదవిని వదులుకోగలిగిన విధేయత ఉన్న రోశయ్యకు కూడా గవర్నర్ పదవి లభించడంలో ఆశ్చర్యం లేదు.

అయితే ఏ కారణాల రీత్యా గవర్నర్ పదవుల్లో నియమించినప్పటికీ, వారి సేవలను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే వారి అనుభవానికి సరైన విలువ ఇవ్వనట్లే అవుతుంది. పోలీసు అధికారులను గవర్నర్లుగా నియమించడం కన్నా రాజకీయ నాయకులను గవర్నర్లుగా నియమించడం వల్లనే కేంద్రానికి సరైన సమాచారం వచ్చే అవకాశం ఉన్నదని, వారి రాజకీయ, పరిపాలనా అనుభవం వల్ల, ప్రజలతో ఉన్న అనుబంధం వల్ల జరుగుతున్న పరిణామాలను సరిగా అర్థం చేసుకోగలరనే వాదన తరచూ వినిపిస్తుంది. రామ్‌లాల్, బూటాసింగ్ వంటి నేతలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను కూలగొట్టేందుకు చూపించిన అత్యుత్సాహం, కర్నాటక ప్రస్తుత గవర్నర్ భరద్వాజ చెప్పినవి వాస్తవాలైనప్పటికీ చూపించిన తొందరపాటు వల్ల వివాదాస్పదం అయినప్పటికీ రాజకీయ నాయకులే గవర్నర్ పదవులకు తగినవారనే అభిప్రాయం ఎక్కువగా వ్యక్తమవుతున్నది. ఆంధ్రప్రదేశ్‌తో సహా దాదాపు ఏడు రాష్ట్రాల్లో ఇప్పుడు మాజీ పోలీసు అధికారులు గవర్నర్లుగా ఉన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌కైతే సైనికదళాల ప్రధానాధిపతినే పదవీ విరమణ తర్వాత గవర్నర్‌గా నియమించారు. ఈశాన్య ప్రాంతాల్లో ఉన్న పరిస్థితుల్లో పోలీసు అధికారులు గవర్నర్లుగా ఉండడం సరైనదేనని వాదించే వారుంటారు. కాని ఎక్కడైనా ప్రజాస్వామిక వ్యవస్థలో పట్టువిడుపులు ఉన్న రాజకీయ నాయకులను గవర్నర్లుగా నియమించడమే సరైనదేనని అనే వారు కూడా లేకపోలేదు.



మూడురోజుల పాటు జరిగిన గవర్నర్ల సమావేశంలో తొలిరోజు రాష్ట్ర గవర్నర్ నరసింహన్ అందరు గవర్నర్లను సమన్వయపరిచి వారి మనోభావాలను తెలుసుకుని సమీక్షించిన తీరు అందరి ప్రశంసలను అందుకుంది. ఎంతైనా మాజీ పోలీసు అధికారి కదా..ఇలాంటి నిర్వహణా శక్తి ఆయన వద్ద పుష్కలంగా ఉంటుంది. చాలా మంది గవర్నర్లు ఎంతో ఉపయోగకరమైన సమాచారాన్ని ఇచ్చారు. శాంతి భద్రతల పరిస్థితి, వ్యవసాయ ఉత్పాదకత, రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్లకు సంబంధించి గవర్నర్లు నిర్వహించాల్సిన పాత్ర, విద్యాలయాల్లో ర్యాగింగ్ ఎజెండాలుగా చర్చలు జరిగాయి. తమిళనాడు గవర్నర్ రోశయ్య రైతులకు కనీస మద్దతు ధర గురించి మాట్లాడారు. కాని నిజంగా గవర్నర్లు తమ ప్రసంగంలోనూ, ఇతరత్రా చెప్పిన అంశాలకు కేంద్రం ప్రాధాన్యమిస్తుందా? అన్నది ముఖ్యం.

అంతే కాదు, గవర్నర్లలో ఎంతమంది తమ బాధ్యతలను సరైన విధంగా నిర్వర్తిస్తున్నారన్నది కూడా చర్చించుకోవాల్సి ఉంటుంది. రాజ్యాంగంలోని 5వ షెడ్యూలు ప్రకారం గిరిజనుల యోగక్షేమాలను ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత గవర్నర్లది. అటార్నీ జనరల్ వాహనావతి, ప్రణాళికా సంఘం నియమించిన మంగేష్కర్ కమిటీ అభిప్రాయాల ప్రకారం గిరిజనుల ప్రయోజనాలను కేంద్రం గవర్నర్ల ద్వారా నేరుగా కాపాడవచ్చు. గవర్నర్లు నిజానికి ప్రతి ఏటా ఈమేరకు వార్షిక నివేదికలు పంపాలి. కాని ఎంతమంది గవర్నర్లు ఈ మేరకు నివేదికలు పంపుతున్నారు? కేంద్రం వాటిని ఎంతమేరకు పట్టించుకుంటున్నది? గిరిజనులపై ఊచకోతల్ని ప్రోత్సహించి, అమలుపరిచిన గవర్నర్లే కాని వారు నిర్వాసితులు కాకుండా కాపాడిన గవర్నర్లు ఎంతమంది ఉన్నారు? కేంద్రం అడగంది మేమేం చేయాలి? అని ఒక గవర్నర్ అన్నారు. కేంద్రం ఆశించే ప్రయోజనాలే వేరు. అవి ప్రజాప్రయోజనాలే కానక్కర్లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

# హైనాల వ్యవస్థలో షైనాల దురవస్థలు

**ఒక రోగిష్టి ముసలి అవ్వ –వికసిస్తున్న విరుల వంటి ఇద్దరు మనమరాళ్లు–ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, జంగత్‌హల్, నారాయణపట్నం, వాకపల్లి, భల్లుగూడ అడవుల్లో కాదు, ఆదివాసీ గూడాల్లోకాదు, నూటికినూరు శాతం విద్య ఉండి, రాష్ట్రమంతా నగరీకరణ చెందిన 'అభివృద్ధి' చెందిన కేరళలో తెలంగాణ ప్రమాణాల ప్రకారం చిన్నపట్నం అనదగిన ఊళ్లో ఎందుకు వేధింపులకు గురవుతున్నారు? స్త్రీలయినందుకు– ముస్లింలయినందుకు, మావోయిస్టు సానుభూతి పరురాలి–తల్లీకూతుళ్లయినందుకు.**

షైనా పేరు ఆంధ్రప్రదేశ్‌లో కూడ మహిళా ఉద్యమంలో పనిచేసే వాళ్లు, హక్కుల ఉద్యమాల్లో పనిచేసే వాళ్లూ, ప్రజాస్వామిక ఉద్యమాలతో సంబంధం ఉన్న వాళ్లు వినే ఉంటారు. మైనారిటీలుగా భావించి ముస్లింల హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాల వివక్షను ప్రశ్నిస్తున్న వాళ్లు కూడా షైనా పేరు వినే ఉంటారు. షైనా ఎన్నో మార్లు హైదరాబాదులో జరిగిన ప్రజాస్వామిక మహిళా సంఘాల సభలకు, హక్కుల సభలకు వచ్చి ఉన్నది కూడ. బహుశా ఒకటి రెండు సందర్భాల్లోనైనా మన దగ్గర వేదికల మీంచి మాట్లాడికూడ ఉండి ఉంటుంది. 2004లో ప్రపంచ సామాజిక వేదికకు ప్రత్యామ్నాయంగా ముంబైలో జరిగిన ముంబై రెసిస్టెన్స్ ఫోరమ్ –ఎంఆర్ 2004లో పాల్గొన్న తెలుగు వాళ్ళందరూ ఆమెను తప్పక గుర్తుపెట్టుకొని ఉంటారు. కనీసం రెండు సందర్భాల్లో ఆమె మన మీడియాతో కూడ వార్తల్లో కనిపించింది.

కేరళలో మళ్ల రాజిరెడ్డి ఆయన సహచరి అరెస్టయినప్పుడు కొన్నిగంటల్లోనే ఆ అరెస్ట్ వార్త తెలుగు మీడియాలో ప్రముఖంగా వచ్చినప్పుడు అందుకు షైనాయే బాధ్యురాలని కేరళ పోలీసులు గట్టిగా అనుమానించారు. ఆమె కొచ్చిన్ విశ్వవిద్యాలయం న్యాయశాస్త్ర విభాగంలో ఉదోగస్తురాలు. ఆమెకు, మావోయిస్టు పార్టీతో సంబంధాలు ఉన్నాయని, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మళ్ల రాజిరెడ్డి, ఆయన సహచరికి కేరళలో ఆశ్రయం ఏర్పాటు చేసిందనే అనుమానంతో ఆరోపణతో అర్ధరాత్రి పూట ఆమె ఇంటిపై దాడిచేశారు. ఆమె లేని సమయంలో ఇంటి తాళం పగలగొట్టి, వారంటు లేకుండా ఇల్లంతా గాలించి, చిందర వందర చేసి ఆమె కంప్యూటర్ సిపియు, డిజిటల్ కెమెరాతో పాటు, కొన్ని సిడిలు ఎత్తుకొని పోయారు. ఆ ఇల్లు నిజానికి షైనా తల్లిది. ఆ ఇంటికి ఆ తర్వాత పోలీసులు తాళంపెట్టి తమ ఆధీనంలో పెట్టుకున్నారు. షైనా తల్లి తన ఇల్లు తాను స్వాధీనం చేసుకోవడం కోసం హైకోర్టు దాకా వెళ్లాల్సి వచ్చింది. ఆమె చేతికి ఇంటి తాళపు చేతులు వచ్చి ఇల్లు తెరిచే వరకు ఇంట్లో ఎన్నో వస్తువులు, కాగితాలు, పుస్తకాలు అన్నీ దొంగిలించబడినవి– పోలీసుల పనే.

అయితే షైనాకు, ఆమె తల్లికి, పిల్లలకు ఇది మొదటి అనుభవం కాదు. చివరి అనుభవం కూడ కాకపోవచ్చు. బెంగళూరులో నందిగ్రాం పోరాటం సందర్భంగా ఒక సాంస్కృతిక బృందం దేశవ్యాప్త ప్రచారంలో భాగంగా కేరళకు వెళ్లినపుడు షైనా వాళ్లకక్కడ కొన్నిచోట్ల సభలు, ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. ఇది విఎస్ అచ్యుతానందన్ పరిపాలనా కాలం. 2007. అటువంటి ఒకసభ ముగిసిన అర్ధరాత్రి షైనా ఇంటిపై పోలీసులు దాడిచేసి రాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఆమెను, ఆమె ఇద్దరు మైనర్ కూతుళ్లను, నందిగ్రాం నుంచి వచ్చిన సాంస్కృతిక బృందాన్ని అరెస్టు చేసి తీసుకువెళ్ళారు. అట్లాగే 'పీపుల్స్ మార్చ్' సంపాదకుడు గోవిందన్ కుట్టి అరెస్టయి వియ్యూరు కేంద్ర కారాగారంలో ఉన్నప్పుడు, ఆయన ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్నాడని తెలిసి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హక్కుల సంఘాల వాళ్లు వెళ్లినప్పుడు షైనా వారిని జైలుకు తీసుకెళ్లిందనే కక్షతో కూడ ఆమెను పోలీసులు అరెస్టు చేయాలని చూశారు.

ఇంటిమీద దాడులు, బెదిరింపులు, అరెస్టులు భరించలేక షైనా కేరళ ముఖ్యమంత్రికి ఒక బహిరంగలేఖ రాసి తనను తాను కాపాడుకోవడానికి తన తల్లిని ఇద్దరు కూతుళ్లనూ ఈ మానసిక హింస నుంచి దూరం చేయడానికి తాను అజ్ఞాతానికి పోతున్నానని ప్రకటించింది. ఆ రోజుల్లో అది సంచలనాత్మక వార్త అయింది. స్త్రీల హక్కుల కోసం, ముస్లింల హక్కుల కోసం, ప్రజాస్వామిక హక్కుల కోసం నిలిచిన షైనా మావోయిస్టు పార్టీ సానుభూతిపరురాలనే అనుమానంతోను, అభియోగంతోను, మాటిమాటికీ రాజ్యం వేధిస్తుంటే ఆమె పనిచేస్తున్న విశ్వవిద్యాలయం గానీ, సభ్యసమాజం గానీ ఆమెకు అండగా నిలబడలేకపోయాయి. గతంలో చాలాకాలం క్రితం తమిళనాడులో రవీంద్రన్ అనే ఒక ఇంజనీరు తనకు విప్లవ భావాలు ఉన్నందుకు ఉద్యోగంలోను, వ్యవస్థలోను ఇమడలేకపోతున్నానని ప్రభుత్వోద్యోగానికి రాజీనామా చేస్తూ ఒక బహిరంగలేఖ రాసి అజ్ఞాత జీవితంలోకి వెళ్లాడు. ఆ తర్వాత 'ఎన్‌కౌంటర్'లో అమరుడయ్యాడు. షైనా కూడ అట్లే తన ఉద్యోగానికి రాజీనామా చేసి అజ్ఞాత జీవితానికి వెళ్లిపోయింది. అయితే ఈ కథ ఇంతటితో ముగియలేదు. నాలుగేళ్లు గడిచిపోయినవి. కేరళలో ప్రభుత్వం మారింది. ఇప్పుడు దృశ్యం షైనా తల్లి ఇంటికి మారింది. ఆ ఇంట్లో షైనా 71 ఏళ్ళ తల్లి, 15 ఏళ్ళ పెద్ద కూతురు, 8 ఏళ్ళ చిన్న కూతురు ఉంటున్నారు. 2011 మే 31న ఆ ఇంటిపై పోలీసులు మళ్లీ దాడి చేశారు. ఆ ఇంటి మీద ఈ నాలుగేళ్లుగానూ నిరంతర పోలీసు నిఘా ఉంటున్నది. ఆ రోజు పెద్దమ్మాయి సహ విద్యార్థి ఆమె దగ్గర తీసుకున్న గొడుగు ఇవ్వడానికి వాళ్ల ఇంటికి వెళ్ళాడు. అతనిని అనుసరించి వెళ్లిన పోలీసులు, ఇంటి తలుపులు పగులగొట్టి ఇల్లంతా గాలించి, ఎన్నో వస్తువులు, సామాగ్రి ఎత్తుకుపోవడమే కాకుండా ఆ విద్యార్థిని కొరియర్‌గా ఆరోపించి అరెస్టుచేసి తీసుకపోయారు. ఆ పదిహేనేళ్ల అమ్మాయికి, అతనికి సంబంధం అంటగట్టి నానా దుర్భాషలాడాడు. పోలీసులు తనను వేధించి, ప్రశ్నించి, మానసికంగా చిత్రహింసలకు గురిచేశారని ఆ అబ్బాయి తర్వాత చెప్పాడు.

షైనా తల్లి మధుమేహ వ్యాధితో బాధపడుతున్నది. హైపర్ టెన్షన్ ఉంది. హృద్రోగానికి బైపాస్ సర్జరీ చేయించుకున్నది. తన కూతురు కళ్ల ముందు లేని బాధతో మనుమరాళ్లను చదివించుకుంటూ తన రెండు కళ్ళలా చూసుకుంటున్నది.

'ఇట్లా ఇంకా ఎందుకు బతుకుతున్నావు. ఈ పిల్లలకింత విషం పెట్టి నువ్వు కూడా ఆత్మహత్య చేసుకోక ఈ బతుకెందుకు?' అని పోలీసులు ఆ పిల్లల ముందే తల్లి గురించి చాల హేయమైన భాష వాడారు. షైనా తల్లికి పిల్లలకు షైనా గురించి నీచమైన ఆరోపణలతో మానసిక వేదన కలిగించడమనే శాడిస్టు ఆనందంతో ఆగిపోకుండా పోలీసులు షైనా పెద్ద కూతురు సహ విద్యార్థిని భయపెట్టి బెదరించి, ఆమెతో సంబంధాలున్నట్లు, ఆమె ప్రవర్తన మంచిది కాదన్నట్లు బలవంతంగా చెప్పించారు. అతణ్ణి అట్లా పోలీసు కస్టడీలో వుంచి మర్నాడు పోలీసులు వాళ్ల ఇంటికి వెళ్ళి–ఆ ఆరోపణలను అంగీకరించమని ఆ అమ్మాయిని బలవంతం చేశారు. వాళ్ల అమ్మమ్మ ఎంత వారించినా వినకుండా ఆ పదిహేనేళ్ల అమ్మాయిని దుర్భరమైన మానసికవేదనకు గురిచేశారు. ఇంక ఆ అమ్మాయి తన 'కన్యాత్వాన్ని రుజువు చేసుకోవడానికి ఏ వైద్యపరీక్షకైనా సిద్ధమే' అని ప్రకటించక తప్పలేదు. అంతటితో కూడా ఆ పోలీసులు ఆ ఇంటికి రావడం మానలేదు. చివరకు షైనా ఎనిమిదేళ్ల చిన్న కూతురును కూడా వేధించడం మానలేదు. వలపాడు పోలీస్‌స్టేషన్ సిఐ ఆ చిన్నపిల్లను పట్టుకొని 'మేమా ...కొడుకును తలమీద బండతో కొట్టీకొట్టీ చంపుతాం' అని అరిచాడు. ఈ వేధింపులు, మానసిక చిత్రహింసలు, మే నెలనుంచి ఇప్పటిదాకా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

ఒక రోగిష్టి ముసలి అవ్వ –వికసిస్తున్న విరుల వంటి ఇద్దరు మన మరాళ్లు–ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, జంగత్‌హల్, నారాయణపట్నం, వాకపల్లి, భల్లుగూడ అడవుల్లో కాదు, ఆదివాసీ గూడాల్లోకాదు, నూటికి నూరు శాతం విద్య ఉండి, రాష్ట్రమంతా నగరీకరణ చెందిన 'అభివృద్ధి' చెందిన కేరళలో తెలంగాణ ప్రమాణాల ప్రకారం చిన్నపట్నం అనదగిన ఊళ్లో ఎందుకు వేధింపులకు గురవుతున్నారు? స్త్రీలయినందుకు–ముస్లింలయినందుకు, మావోయిస్టు సానుభూతి పరురాలి–తల్లీకూతుళ్లయినందుకు. కేరళలో –చిరకాలం వామపక్ష ప్రభుత్వాలు పాలించిన కేరళలో – 'టెర్రరిజం మీద యుద్ధం' పేరుతో ముస్లింలు, ముస్లిం హక్కులకోసం పోరాడే వాళ్లను ఎట్లా వేధించవచ్చునో అబ్దుల్ నాసర్ మధానీ సందర్భంలో చూశాం. ఎన్నికల ప్రయోజనాల కోసం అక్కడ అన్ని పార్టీలు రెచ్చగొడుతున్న మత విద్వేషాలు చూస్తున్నాం. కేరళ ఇప్పుడు దుబాయి డబ్బుతో, దుబాయి వలసలతో 'జిహాద్' కేంద్రమైందనే ప్రచారాన్ని హిందుత్వ శక్తులు పెద్దఎత్తున చేస్తున్నాయి. విద్యావంతులైన ముస్లింలను అరెస్టు చేస్తున్నాయి. ఈ విషయంలో రాజకీయ పార్టీలకన్నా రెండాకులు ఎక్కువ చదివినట్లుగా మీడియా వ్యవహరిస్తున్నది. ముస్లింలలో లౌకిక ప్రజాస్వామ్య భావాలు కలవాళ్లు, మైనారిటీ హక్కుల కోసం నిలిచిన వాళ్లు మీడియా వారికి మావోయిస్టులుగా కనిపిస్తున్నారు. మావోయిస్టులు దేశ భద్రతకు పెద్ద అంతరంగిక ప్రమాదంగా పరిణమించారు–అనడానికి ఐఎస్ఐ నుంచి వీళ్ళకు ఆయుధాలు, ఆయుధ శిక్షణ లభిస్తున్నదనే ఆరోపణలు కేంద్ర నిఘా విభాగం అవసరమైనప్పుడల్లా నెత్తికెత్తుకుంటుంది. అయినా షైనా తల్లీ, పిల్లల పట్ల పోలీసులు అంత అమానుషంగా వ్యవహరించడం సబబే అవుతుందా? చట్టబద్ధమే అవుతుందా? న్యాయమే అవుతుందా? షైనా తల్లికి, పిల్లలకు జరిగిన ఈ అన్యాయం గురించి విచారించడానికి ఒక నిజనిర్ధారణ కమిటీ వెళ్లింది. అందులో రాజకీయ ఖైదీల విడుదల కమిటీకి చెందిన కేశవన్, మురుగన్, హక్కుల కార్యకర్త గోపాల్ (తమిళనాడు) ఉన్నారు. కేరళ నుంచి ప్రజాసంఘాల కార్యకర్తలు జి.వాసు, సుగతన్, అజయన్ ఉన్నారు. వీళ్లనందరినీ త్రిసూరులో వీళ్ల బస చేసిన హోటల్లోనే అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకపోయారు. డిఎస్పీ థామస్ వీళ్లను బండబూతులు తిట్టాడు. వీళ్లంతా సామూహికంగా తీవ్రంగా స్పందించడంతో, బయటినుంచి గూడ ప్రజాసంఘాల కార్యకర్తలు వచ్చి ఆందోళన చేయడంతో మధ్యాహ్నానికి వీళ్లను వదిలారు.

తెలంగాణలో 2009 నవంబర్ 29 నుంచి దాదాపు రెండేళ్ళుగా మనం సామూహికంగా నిర్బంధాన్ని రుచిచూస్తున్నాం. 'దేశమే ఒక జైలాయెరా' అని చెరబండరాజు జైలు నుంచి కోర్టుకు తీసుకువెళ్ళినపుడు సంకెళ్ల నేపథ్యంతో పాడినట్లు ఇవ్వాళ తెలంగాణ ఒక కాన్సంట్రేషన్ క్యాంప్‌గా మారింది. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా రైల్‌రోకో నిర్వహించిన వాళ్ళలో అరవై మంది మహిళలను దాష్టీకంగా అరెస్టు చేసి సుప్రీం కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా పోలీసు లాకప్‌లలో పెట్టడమే కాకుండా రైల్వేచట్టాల కింద కేసులు పెట్టడం కూడా చూశాం. పాలక పార్టీల ఎంపీలకు, ఎమ్మెల్యేలకే గృహ నిర్బంధాలు, రైల్వే కేసులు తప్పనప్పుడు ఇంక ప్రజల గోడు చెప్పనక్కర్లేదు. కేరళలో సిఐడి ఎస్పీల భాషకు ఆంధ్రప్రదేశ్‌లో డిజిపి భాషకు తేడా లేదు. ఇది గ్లోబల్ అణచివేత భాష. బాధలు స్థానికం అవుతున్నాయి. అణచివేత అంతర్జాతీయం అవుతున్నది. అందుకే సామూహిక, సాహస, అపూర్వ ప్రజాస్వామిక పోరాటంలో ఉన్న తెలంగాణ ప్రజలతో, మనకు దూరాన పడమటి సముద్రతీరాన ఒక చిన్న పట్టణంలో ఒక అవ్వ, ఆమె మనుమరాళ్ల మనోవేదన పంచుకోవాలని అనిపించింది. మనం రెండేళ్ళుగా చిందిస్తున్న కన్నీళ్ళు, నెత్తురు, ఆ అసహాయ కటుంబం కన్నీళ్లు తుడిచే కొత్త టానిక్ అవుతుందనే భరోసాతో పోరాట ప్రజలకు చెప్పాలని అనిపించింది. ఇంటింటికీ ఒక మంటిపొయ్యి ఉన్నవాళ్లకే కదా ఇంకొకరి కడుపుతీపి అయినా, కడుపుకోత అయినా అర్థమయ్యేది!

– వరవరరావు